సాక్షి
కుమురం భీం
బుధవారం । 17 । జనవరి । 2024



**‘పది’లో ఏడు పేపర్లు**

ప్రభుత్వం పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. ఈ ఏడాది ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు. 8లో▸



**ముగిసిన ‘దీప్‌స్వరూప్’**

ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్యక్షేత్రంలోనే దీపోత్సవం (దీప్‌స్వరూప్) కార్యక్రమం ముగిసింది. కటోడాలు దేవతా విగ్రహాలను శుద్ధి చేశారు. 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
32.1 /18.9

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. వేకువ జామున పొగమంచు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రేపు స్థాయీ సంఘాల సమావేశం

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందరంలో గురువారం స్థాయీ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో రత్నమాల ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 18న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థాయీ సంఘం- 7(పనులు), స్థాయీ సంఘం- 1 (ప్రణాళిక, ఆర్థిక), మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు స్థాయీ సంఘం -2(గ్రామీణాభివృద్ధి), మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు స్థాయీ సంఘం- 3(వ్యవసాయం), సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు స్థాయీ సంఘం - 4 (విద్య, వైద్యం), సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్థాయీ సంఘం- 5(మహిళా సంక్షేమం), 5 గంటల నుంచి 6 గంటల వరకు స్థాయీ సంఘం- (సాంఘిక సంక్షేమం) సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశాలకు సభ్యులు, సంబంధిత అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

### ‘ఆదివాసీలపై నేరం మోపడం సరికాదు’

**ఆసిఫాబాద్‌అర్బన్:** పులులు చనిపోతే ఆదివాసీలపై అటవీశాఖ ఆ నేరం మోపడం సరికాదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిపిన అధికారులు.. ఆ తర్వాత ఆదివాసీ పశువుల కాపర్లను అదుపులోకి తీసుకుని చితకబాదడం బాధాకరమన్నారు. పులుల మరణం కేసులో అమాయకులను ఎలాంటి ఆధారాలు లేకున్నా చితకబాది నేరం ఒప్పుకునేలా చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఆదివాసీలపై దాడులకు దిగితే ఊరుకోమని, మలిదశ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పులి దాడిలో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఇప్పటివరకు అటవీశాఖ సాయం అందించలేదని ఆరోపించారు.

### ఆలయం వద్ద సౌకర్యాలు కల్పిస్తాం



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**కెరమెరి(ఆసిఫాబాద్):** ఓంపురి వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవత ఆలయం వద్ద సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. కెరమెరి మండలం చిన్నపాట్నాపూర్ గ్రామంలోని ఆలయంలో సోమవారం రాత్రి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో చేతి పంపు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, గ్రామం నుంచి ఆలయం వరకు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. వంటగది నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే షష్టి పూజల్లోగా సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్‌లాం, నాయకులు సిడాం భీంరావు, ఆత్రం భీంరావు, సోనేరావు, మారుతి, రఘునాథ్ పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

**ఆసిఫాబాద్:** ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఆర్వో సురేశ్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల సవరణకు దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. మరణించిన వారి వివరాలు జాబితా నుంచి తొలగించేందుకు నోటీసుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సంబురంగా సంక్రాంతి

**ఆసిఫాబాద్:** జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలు ఆకట్టుకోగా.. గంగిరెద్దులు సందడి చేశాయి. సకినాలు, గారెలు, అరిసెలు వంటి పిండి వంటకాలు ఘుమఘుమలతోపాటు బంధువులు, పిల్లాపాపలతో ప్రతీ ఇల్లు కళకళలాడింది. ముత్తైదువులు రుక్మిణీ కల్యాణం, శ్రీనివాస కల్యాణం, బృందావనం, చెర్లచామంతి, గోపాల కల్యాణం, తులసీ కల్యాణం, సూర్యబోనాలు, చంద్రబోనాలు, గ్రామ పసుపు, చెరుకుతోట, పుసుపుతోట, ఆరని జ్యోతి, లాలిగౌరమ్మ, రేపల్లెవాడ, జామ, నిమ్మ నోములను భక్తిశ్రద్ధలతో నోముకున్నారు. పండుగ సందర్భంగా ప్రజలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పలు మండలాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధిలో మహిళలు సామూహిక పంచాక్షరి నోము నోముకోగా.. అయ్యప్ప ఆలయంలో దీపాలంకరణ ఆకట్టుకుంది.



ఈదులవాడలో ముగ్గుల పోటీలు



రెబ్బెన: ఇంటి ఎదుట గంగిరెద్దు కోలాహలం



అయ్యప్ప ఆలయంలో దీపాలంకరణ



జిల్లా కేంద్రంలో నోముకుంటున్న మహిళలు

# పేకాట.. కోడి పందేలు

- సంక్రాంతి పండుగ నందర్భంగా జోరుగా నిర్వహణ
- జిల్లాలో పలుచోట్ల పోలీసుల దాడులు
- పలువురిపై కేసులు నమోదు



కోడి పుంజులు

**కౌటాల(సిర్పూర్):** ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేలకు క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కుమురంభీం జిల్లాలోనూ సంక్రాంతి పండుగకు ఈ ఆట జోరుగా సాగింది. పండుగను పురస్కరించుకుని పది రోజుల ముందు నుంచే పందెంరాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక పేకాట, కోడి పందేల స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కోడి పందేల కోసం ఏర్పాటు చేసిన స్థావరాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులకు నిందితులు చిక్కలేదు. అయితే గడిచిన పది రోజుల్లో పలువురిపై కేసులు నమోదయ్యాయి. అది, సోమవారాల్లో పందెంరాయుళ్లు కోడి పుంజులను బైక్‌లపై తరలిస్తూ కనిపించారు. కోడి పుంజుల ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకోగా.. అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**రహస్యంగా నిర్వహణ**

గతంలో కోడి పందేల నిర్వహణ జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్నా ప్రస్తుతం ఈ సంప్రదాయం పల్లెలకు సైతం విస్తరించింది. ఈ పందేల్లో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారింది. సాధారణంగా పోటీలకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన జాతులకు చెందిన కోడి పుంజులను మాత్రమే వినియోగిస్తారు. వాటి ధర కూడా రూ.వేలల్లో ఉంటుంది. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని రహస్య ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగగా.. కాగజ్‌నగర్ డివిజన్‌లో పేకాట కేసులు వెలుగులోకి వచ్చాయి. కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లో పేకాట జోరుగా ఆడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఈ వ్యసనానికి బానిసలుగా మారి ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

**పక్కా ప్లాన్‌తోనే..**

కోళ్ల పందేలను నిర్వాహకులు పక్కా ప్లాన్‌తో నిర్వహిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా జనసంచారం అంతగా లేని స్థలాలను గుర్తించి స్థానికుల సాయంతో ముందుగా పరిశీలన చేపడుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లను ఒకచోటుకు తీసుకొచ్చి ఆ ప్రాంతంలోకి ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రూ.10 వేల నుంచి మొదలు రూ.లక్షల్లో పందేలు కాస్తారు. జిల్లాలో ఏటా సంక్రాంతి పండుగకు భారీ ఎత్తున కోడి పందేలు, పేకాట జరుగుతున్నా నిందితులపై నామమాత్రపు కేసులు మాత్రమే నమోదవుతున్నాయి. కోడి పందేలపై ప్రభుత్వ నిషేధం ఉండటంతో నిందితులపై జంతు హింస నిరోధక చట్టం 1960 ప్రకారం సెక్షన్ 11 కింద కేసులు నమోదు చేస్తారు.

**ఇటీవలి ఘటనలు**

- ఈ నెల 5న వాంకిడి మండలం బంబార గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి, రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 7న వాంకిడి మండలం వెల్గి పంచాయతీ పరిధిలోని ఖేడెగాం గ్రామ శివారులో జోరుగా కోడి పందేలు నిర్వహించారు. పోలీసులు విషయం తెలిసి ఘటనా స్థలానికి వెళ్లేసరికి పందెంరాయుళ్లు పరుగులు తీశారు.
- ఈ నెల 13న కాగజ్‌నగర్ మండలం నాయకపు అనుకోడ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 14న కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాజ్ ప్రాంతంలో పది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. రూ.20 వేల నగదు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.
- 15న వాంకిడి మండలం వెల్గి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.3620 నగదు పట్టుకున్నారు. చింతలమానెపల్లి మండలం దిందా, ఆడెపల్లి గ్రామాల సమీపంలో కోడి పందేలు ఆడుతున్న 14మందిపై కేసు నమోదు చేశారు.

## గిరిజనుల అభివృద్ధికి ‘పీఎం జన్‌మన్’

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

**ఆసిఫాబాద్‌అర్బన్:** గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(జన్‌మన్) ద్వారా కృషి చేస్తుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా పీఎం జన్‌మన్ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, అధికారులు, గిరజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం రూ.24 వేల కోట్లతో పీఎం జన్‌మన్ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 15 రాష్ట్రాల్లో 22 వేల గ్రామాలను గుర్తించి 39 లక్షల కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధమైందన్నారు. పక్కా ఇళ్ల నిర్మాణం కోసం లక్ష మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తారని పేర్కొన్నారు. 27 వేల ఇళ్లకు నల్లా కనెక్షన్లు, 503 గ్రామాలకు మొబైల్ టవర్లు, 300 గ్రామాలకు విద్యుత్ కనెక్షన్లు, పది వేల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు, రూ.5లక్షల విలువైన ఉచిత వైద్య సదుపాయం కోసం ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను గిరిజన ఆదివాసీలకు అందజేస్తారని తెలిపారు. అలాగే అవసరమైన ఆధార్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. రాష్ట్రంలో 468 గ్రామాల్లో 55 వేల మంది గిరిజనులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతారని తెలిపారు. ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించి అర్హతల మేరకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. జిల్లాలోని 149 ఆవాసాల్లో సురక్షితమైన గృహ నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రహదారులు, విద్యుత్, టెలికాం కనెక్టివిటీ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. వెనుకబడిన పీవీటీజీ కుటుంబాలు సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

**కాగజ్‌నగర్‌టౌన్:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ ఒంటరిగానే పోటీలోకి దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయవతి జన్మదినం సందర్భంగా మంగళవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని, బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగానికి లోబడి దేశంలో పనిచేస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు అర్షద్ హుస్సేన్, గణపతి, నాయకులు జాడి శ్యామ్‌రావు, శంకర్, అశోక్, లెండుగురే శ్యామ్‌రావు, రాజ్‌కుమార్, మనోహర్, టక్కరి పోషం, శ్రీనివాస్, కొండా రాంప్రసాద్, విజయ, నిర్మల, లలిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ‘లింకేజీ’ కష్టాలు



ఈ ఫొటోలోని యువకుడి పేరు మహదేవుని పవన్‌కుమార్. రెబ్బెన మండలం గోలేటికి చెందిన పవన్‌కుమార్ బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాలేదు. సాంకేతిక సమస్యలతో అనుసంధానం కాలేదని సిబ్బంది చెప్పడంతో కొన్నిరోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాడు. పనికి దూరమయ్యాడు.

- వందశాతం పూర్తికాని ఆధార్‌తో జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాల అనుసంధాన ప్రక్రియ
- జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన చెల్లింపుల విధానం
- ఉపాధిహామీ పనులకు పలువురు కూలీలు దూరం



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

**తిర్యాణి(ఆసిఫాబాద్):** కేంద్ర ప్రభుత్వం గతేడాది నుంచి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధాన ప్రక్రియతోపాటు ఉపాధిహామీ కూలీల బ్యాంకు ఖాతాలకు సైతం ఆధార్‌ను లింకేజీ చేస్తున్నారు. ఆధార్ అనుసంధాన ప్రక్రియకు గతేడాది డిసెంబర్ 31తో గడువు ముగిసింది. అయినా వందశాతం లింకేజీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో కూలీలు ఉపాధిహామీ పనులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది.

**1,71,046 యాక్టీవ్ కూలీలు**

జిల్లాలో మొత్తం 1,71,046 యాక్టీవ్ కూలీలు ఉన్నారు. ఇందులో 1,65,677 మంది తమ ఆధార్ కార్డుతో జాబ్‌కార్డును అనుసంధానం చేసుకున్నారు. 1,63,925 మంది కూలీల బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం కూడా పూర్తయింది. గతేడాది ప్రారంభమైన అనుసంధాన ప్రక్రియను దాదాపు ఐదుసార్లు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. 2023 డిసెంబర్ 31 వరకు చివరి గడువు విధించింది. అయినా జిల్లాలో వందశాతం ఆధార్‌తో జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాల అనుసంధాన ప్రకియ పూర్తి కాలేదు. మరో 5,369 మంది కూలీలకు సంబంధించిన జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రకియ చేయాల్సి ఉండగా.. అలాగే 7121 కూలీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతాలతో ఆధార్ లింకేజీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం జనవరి 1 నుంచి ఉపాధిహామీ పనుల చెల్లింపుల్లో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) విధానంలో భాగంగా ఆధార్ బ్రిడ్జి పేమెంట్ సిస్టమ్ (ఏబీపీఎస్)ను అమలు చేస్తోంది. ఇప్పటికీ ఆధార్ లింకేజీ చేసుకోని కూలీలను అధికారులు పనులకు తీసుకోవడం లేదు.

**అనుసంధానానికి చిక్కులు**

ఉపాధిహామీ కూలీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నా కొన్ని విఫలమవుతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా కూలీకి సంబంధించిన బ్యాంకు ఖాతా ఇన్ యాక్టీవ్‌లో ఉండడంతోపాటు గతంలో తీసుకున్న ఖాతాలకు సంబంధించి ఈ- కేవైసీ పూర్తికాకపోవడం కూడా సమస్యగా మారుతోంది. ఇలాంటి సమస్యలతో అనుసంధానం విజయవంతం కావడం లేదని కూలీలు చెబుతున్నారు. కూలీలు బ్యాంకుకు వెళ్లి ఖాతాకు యాక్టీవ్ చేసుకోవడం, ఈ- కేవైసీ పూర్తి చేసుకుంటే ఆధార్ బేస్డ్ పేమెంట్‌కు అనుమతి ఇస్తున్నట్లు దరఖాస్తు అందించాల్సి ఉంటుంది.

**బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం వివరాలు**

| మండలం | కూలీల సంఖ్య | పూర్తయింది | కావాల్సింది |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 14456 | 13938 | 518 |
| బెజ్జూర్ | 13093 | 12485 | 608 |
| చింతలమానెపల్లి | 11766 | 11213 | 553 |
| దహెగాం | 13598 | 12917 | 681 |
| జైనూర్ | 12301 | 11765 | 536 |
| కాగజ్‌నగర్ | 14322 | 13685 | 637 |
| కెరమెరి | 13181 | 12753 | 428 |
| కౌటాల | 14607 | 13935 | 672 |
| లింగాపూర్ | 7863 | 7580 | 283 |
| పెంచికల్‌పేట్ | 6991 | 6608 | 383 |
| రెబ్బెన | 12363 | 12030 | 333 |
| సిర్పూర్(టి) | 8162 | 7877 | 285 |
| సిర్పూర్(యూ) | 7370 | 7176 | 194 |
| తిర్యాణి | 9596 | 9207 | 389 |
| వాంకిడి | 11335 | 10714 | 621 |

**అనుసంధానం చేసుకోవాలి**

సాంకేతిక సమస్యలతో ఇప్పటికీ బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం పూర్తి కాని కూలీలు బ్యాంకుల్లో ఖాతాను యాక్టీవ్‌గా మార్చాలి. ఈ- కేవైసీ సైతం పూర్తి చేసుకోవాలి. జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాతో అనుసంధానం కానివారికి పనులు కల్పించేందుకు అవకాశం లేదు.

– శ్రవణ్‌కుమార్, ఏపీవో, వాంకిడి

## క్లుప్తంగా

### రేషన్‌బియ్యం పట్టివేత


బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** మండలంలోని దేవుల గూడలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ నుండి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు జి.రాజ్‌కుమార్, బి, శ్యాంలాల్ దేవులగూడలోని కిరణ్‌కుమార్‌కు చెందిన రేకుల షెడ్డులో 220 బస్తాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని సీజ్ చేసి కాగజ్‌నగర్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. కిరణ్‌కుమార్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

**వాంకిడి:** మండలంలోని వెల్గీ గ్రామ శివారులో సోమవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,620 నగదు స్వాదీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడినా, గుడుంబా, దేశీదారు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న శ్రీహరి

**మంచిర్యాలటౌన్:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, కన్నెపల్లి, మందమర్రి, మంచిర్యాల యూనిట్ల గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, 29న మందమర్రి, కన్నెపల్లి, 30న మంచిర్యాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ ప్రాథమిక సభ్యుడు ఎన్నికల తేదీ ముందు రోజు వరకు సభ్యత్వం పొందాలని సూచించారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**కాసిపేట:** మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం సాలెగూడకు చెందిన కుడిమేత గంగు (52)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 15న ఉదయం మద్యం మత్తులో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని అటవీప్రాంతంలో చెట్టుకు చున్నీతో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతునికి భార్య సావిత్రిబాయి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### కోడి పందేలు ఆడుతున్న 14 మందిపై కేసు

**చింతలమానెపల్లి:** మండలంలోని దిందా, ఆడెపల్లి గ్రామాల సమీపంలో కోడి పందేలు ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో సోమవారం దాడులు నిర్వహించగా 5 కోడిపుంజులు, రూ.3 వేల నగదు పట్టుబడినట్లు వివరించారు. దిందాలో ఐదుగురిపై, ఆడెపల్లిలో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

### మద్యం నిషేధించాలని వినతి

**బెజ్జూర్:** తమ గ్రామంలో మద్యం నిషేధించాలని మండలంలోని మర్తిడీ గ్రామానికి చెందిన మహిళలు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం కారణంగా ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇంట్లోని వస్తువులను తాకట్టు పెట్టుకుని మరీ తాగుతున్నారని వాపోయారు. గ్రామంలో విచ్చలవిడిగా గుడుంబా, బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని, వీటిని పూర్తిగా తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ ఉమ్మెర లింగయ్య, పోశక్క, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుస శంకర్ యాదవ్, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

### రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని శవం


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి సీఓటీ మెడికల్ వార్డులో ఇటీవల రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గుర్తు తెలియని వృద్ధుడిని మానవ సేవే మాధవ సేవ సభ్యులు చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 12న మృతిచెందినట్లు రిమ్స్ ఆర్ఎంవో చందు తెలిపాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, సంబంధికులు ఉంటే మృతదేహాన్ని తీసుకెళ్లాలని తెలిపారు.

# 'పది'లో ఏడు పేపర్లు


పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

- ఎస్సెస్సీలో సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలు
- మిగతా సబ్జెక్టులు మాత్రం రోజుకొకటి..
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందంటున్న నిపుణులు

**నిర్మల్‌ఖిల్లా:** ప్రభుత్వం పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌లో ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతంలో ప్రతీ పరీక్ష ఒక్కోరోజు నిర్వహించగా ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించనుంది. మిగతా సబ్జెక్టుల పేపర్‌కు 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తుండగా, సైన్స్ రెండు పరీక్షలు విభజించి ఒక్కో పరీక్ష 50 మార్కులకు నిర్వహించనుంది. ఈ కొత్త విధానంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**రెండేళ్లుగా ఒకే పరీక్ష...**

రెండేళ్లుగా ఈ రెండు పేపర్లు ఒకే పరీక్షగా, ఒకే రోజున నిర్వహించే వారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులను వేర్వేరుగా పరీక్షలు నిర్వహించడానికి ఈసారి కాలనిర్ణయ పట్టికను విడుదల చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్రాలకు ఒక్కో ఉపాధ్యాయుడు బోధిస్తుండగా సైన్స్ సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు వేర్వేరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో పరీక్షలు కూడా వేరువేరుగా ఉండాలనే వినతులు ఉత్పన్నమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ కూడా నిర్ణయం తీసుకుని ఒక్కో పరీక్షకు 50మార్కుల చొప్పున రెండు పరీక్షలను నిర్వహించనున్నారు.

**ఈసారి భిన్నంగా సైన్స్ పరీక్షలు...**

కరోనా సంక్షోభానికి ముందు హిందీ మినహా మిగతా సబ్జెక్టులకు రెండు వేర్వేరు పరీక్షలు 50 మార్కుల చొప్పున నిర్వహించేవారు. కరోనా అనంతరం అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షగా రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈసారి భిన్నంగా మిగతా అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షను ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు మాత్రం ప్రత్యేకంగా వేర్వేరు రోజుల్లో టైం టేబుల్ విడుదల చేయడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ మేరకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు కూడా విద్యార్థులకు మెలకువలను సూచించేందుకు తగిన సమయం లభిస్తుంది. ఒక్కో పరీక్షకు ఒక్కో వ్యూహాన్ని అనుసరించడానికి వీలుంటుంది. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భౌతిక శాస్త్రం పరీక్ష మార్చి 26న, జీవశాస్త్రం పరీక్ష 28న నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు.

**ప్రభుత్వ నిర్ణయం సమంజసం...**



పదో తరగతిలో ఏడు పేపర్లను వేరువేరు రోజుల్లో పరీక్షలు నిర్వహించడానికి టైం టేబుల్ విడుదల చేసింది. దీంతో విద్యార్థులకు మంచి వెసులుబాటు ఉంటుంది. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలను పరిగణలోకి తీసుకుని నూతనంగా పరీక్షలు నిర్వహించేందుకు టైం టేబుల్‌ను ఖరారు చేసింది.

– జువ్వల శ్రీధర్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), జెడ్పీహెచ్ఎస్, పాక్‌పట్ల

**విద్యార్థులకు వెసులుబాటు...**



భౌతిక రసాయన జీవశాస్త్ర పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించేందుకు విద్యాశాఖ టైంటేబుల్ విడుదల చేయడం హర్షనీయం. ఈ విధానంతో విద్యార్థులకు కూడా వెసులుబాటు కలుగుతుంది. ఒత్తిడికి గురికాకుండా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను వేరువేరు రోజుల్లో ప్రశాంతంగా రాసేందుకు వీలుంటుంది.

– జి.రాంచందర్, పీజీహెచ్ఎమ్, జెడ్పీహెచ్ఎస్, పెంబి

# ముగిసిన 'దీప్‌స్వరూప్'


అమ్మవారికి నైవేద్యం తయారుచేస్తున్న ఆదివాసీలు


రావుడ్ దేవతల ఎదుట దీపారాధన

- జంగుబాయి ఆలయంలో పూజలు
- దేవతా విగ్రహాల శుద్ధి


మాట్లాడుతున్న మరప బాజీరావు

**కెరమెరి(ఆసిఫాబాద్):** ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్యక్షేత్రంలోనే సోమవారం రాత్రి దీపోత్సవం (దీప్‌స్వరూప్) కార్యక్రమం నిర్వహించారు. జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన కటోడాలు జంగుబాయి ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను టొప్లకసలోని నీటితో శుద్ధి చేశారు. అక్కడే నైవేద్యం తయారుచేసి ఆరగించారు. జంగుబాయి, పోచమ్మ, రావుడ్‌తో పాటు మరో ఏడు దేవతా విగ్రహాలను ఆచార వ్యవహారాలతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

**తీర్మానాలు ఇవే..**

- ఎనిమిది గోత్రాలకు చెందిన వారు వాలం టీర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- పుష్యమాసంలో నెలవంక మరుసటిరోజు దీపారాధన కార్యక్రమం నిర్వహించాలి.
- మేశం యజమాని ఇష్టతో ఇచ్చిన విరాళం స్వీకరించాలి.
- గేటు బయటనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలి. ఫోర్ వీలర్‌కు రూ.100, త్రీవీలర్‌కు రూ.30, టూవీలర్‌కు రూ.20 చొప్పున చార్జీలు వసూలు చేయాలి.
- మద్యం సేవించిన వారికి అనుమతి లేదు. ఆలయ ప్రాంగణంలోకి పాదరక్షలు లేకుండా రావాలి అనే తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావు, వివిధ గ్రామాలకు చెందిన కటోడాలు రాయిసిడాం జంగు, తుమ్రం మల్కుపటేల్, మరపాంగురంగ్, మండడి జాకు, ఎర్రకుమ్ర రాంశావ్, సలామ్ నాగోరావు, వెట్టి చందు, రాయిసిడాం శంకర్, మరపోశేరావు, హెర్రకుమ్ర రాంశావ్, తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో ఆత్మహత్య

**కాగజ్‌నగర్‌టౌన్:** కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై కళ్యాణ్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీకి చెందిన డి.శ్రావణ్ కుమార్ అలియాస్ సాయి (30) సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాథమిక విచారణలో కుటుంబ కలహాలే కారణమని తేలిందని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

# కడుపులో దిగిన కోడి కత్తి


కత్తి దిగడంతో బయటకు వచ్చిన పేగులు

**వేమనపల్లి:** పందెంలో కోడికాలుకు కట్టాల్సిన కత్తిని ఓ ప్రబుద్ధుడు తన ఒరలో దాచుకున్నాడు. ఫలితంగా కత్తి కడుపులోకి దిగి పేగులు బయటపడ్డాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్ కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కుమురంభీం జిల్లా దహెగాంకు వెళ్లాడు. పండుగ పూట కోడిపందేల కోసం స్వగ్రామం లక్ష్మీపూర్‌కు వచ్చాడు. మద్యం సేవించి జక్కేపల్లి సమీపంలో నిర్వహించే కోడిపందేల వద్దకు వెళ్లాడు. పందెంకోళ్లకు కత్తి కట్టి విరామ సమయంలో కత్తిని నడుం భాగంలోని ఒరలో దాచుకున్నాడు. పందేలాట గజిబిజీలో ఒరలో ఉన్న కత్తి పొట్ట భాగంలో దిగింది. తీవ్ర రక్తస్రావమై కడుపులో పేగులు బయటకు వచ్చాయి. స్థానికులు అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు.

**భారీగా కోడి పందెలు**

లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్, మరో వ్యక్తి, జక్కేపల్లి గ్రామానికి చెందిన మరొకరు గ్రామ చేరువలోని జక్కేపల్లి వెళ్లే దారి వద్ద కోడిపందేల స్థావరం ఏర్పాటు చేశారు. సోమవారం ఒక్కో పందెం కోడి నుంచి రూ.300 నుంచి వసూలు చేస్తూ పందేలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కోడి కత్తి గాయం కావడంతో ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారి స్థావరాల నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై నీల్వాయి ఎస్సై సుబ్బారావును సంప్రదించగా.. తాను సెలవులో ఉన్నానని, వివరాలు సేకరిస్తానని తెలిపారు.

# హాంకాంగ్‌లో చూసి కొత్త ఆలోచన

- డ్రాగన్ ఫ్రూట్ సాగుపై అన్నదమ్ముల దృష్టి
- ఎకరం పది గుంటల్లో 2 వేల మొక్కలు పెంపకం
- ఏడాదికి రూ.4 లక్షల ఆదాయం


దేవునిగూడలో వేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోట

**జన్నారం:** ఉపాధి కోసం హాంకాంగ్ వెళ్లిన యువకుడు అక్కడ వేసిన డ్రాగన్‌ఫ్రూట్ పంటను చూడడంతో తనకు ఓ కొత్త ఆలోచన వచ్చింది. తమ చేనులో కూడా డ్రాగన్ ఫ్రూట్ పంట వేయాలనుకుని విషయం తన అన్నతో చెప్పాడు. అతను కూడా సై అనడంతో పంట సాగుకు ముందుకు వచ్చారు. ఏడాదిక్రితం పంట వేయగా ప్రస్తుతం ఫలాలు ఇస్తుంది.

**హాంకాంగ్‌లో చూసి ఆలోచన**

జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన కల్లెం రవీందర్‌రెడ్డి, జమున దంపతులకు ఇద్దరు కుమారులు. పిల్లలు చిన్నతనంలోనే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. దీంతో తల్లి జమున కూలిపని చేస్తూ వారిని డిగ్రీ వరకు చదివించింది. పెద్ద కుమారుడు శివకృష్ణారెడ్డి వ్యవసాయం వైపు వెళ్లగా సాయికృష్ణారెడ్డి ఉపాధి కోసం హాంకాంగ్ వెళ్లాడు. అక్కడ ఎక్కువశాతం మంది డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తుండడంతో పంట గురించి తెలుసుకున్నాడు.

**జగిత్యాల రైతు వద్ద అవగాహన**

జగిత్యాల జిల్లా అంతర్‌గావ్‌కు చెందిన రైతు శుభాష్‌రెడ్డి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నట్లు శివకృష్ణారెడ్డి యూట్యూబ్‌లో తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లి రైతు వద్ద పంట గురించి పూర్తిగా తెలుసుకుని తమ్మునికి వివరించాడు. అతను సరే అనడంతో తమకున్న ఎకరం 10 గుంటల భూమిలో 2022 డిసెంబర్‌లో అదే రైతు వద్ద నుంచి రూ.80కి ఒక మొక్క చొప్పున 2 వేల మొక్కలు కొనుగోలు చేశారు. 500 సిమెంటు దిమ్మెలు తీసుకువచ్చారు. ఒక్కో దిమ్మె చుట్టూ నాలుగు మొక్కలు నాటి డ్రిప్ ద్వారా నీటిని అందించారు. మొత్తంగా రూ.6 లక్షల వరకు ఖర్చు చేశారు.

**అందుతున్న ఫలాలు**

గతేడాది డిసెంబర్‌లో మొక్కలు నాటగా 2023 నవంబర్‌లో కాయలు కాశాయి. మొదటి దశలో ఆశించినంత కాయకపోవడంతో వాటిని సొంతానికి వాడుకున్నారు. ఏటా జూన్ నుంచి నవంబర్ వరకు పంట చేతికి వస్తుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలోకు రూ.150 ఉందని, ఎకరం పది గుంటల్లో సుమారు 2 టన్నుల పంట వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కసారి పంట వేస్తే 20 సంవత్సరాల వరకు ఫలాలు వస్తుంటాయని, మొక్క పెరిగిన కొద్దీ కత్తిరిస్తూ ఉంటే ఏటా పంట చేతికి వస్తుందన్నారు. ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

**కొత్త ఆలోచనతో సాగు**



ఉపాధి కోసం హాంకాంగ్ వెళ్లా. అక్కడ ఆన్‌లైన్ పనిచేస్తూ అప్పుడప్పుడు బయటకు వెళ్లగా ఎక్కువగా డ్రాగన్‌ఫ్రూట్ పంట కనిపించేది. అదే పంటను మా భూమిలో కూడా వేయాలని కొత్త ఆలోచనతో వచ్చింది. అన్నతో చర్చించి మా భూమిలో మొక్కలు నాటాం. ఇప్పుడు మొదటి క్రాపు చేతికి వచ్చింది. – సాయికృష్ణారెడ్డి

**సబ్సిడీ ఇవ్వాలి**



మా తమ్మునికి వచ్చిన ఆలోచనతో ఎకరం పది గుంటల్లో మొక్కలు నాటాం. డ్రిప్‌తో నీరందిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.6 లక్షలు ఖర్చు వచ్చింది. వచ్చే జూన్ వరకు రెండో క్రాప్ వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆయిల్‌పాం పంట మాదిరి డ్రాగన్‌ఫ్రూట్ పంటకు కూడా సబ్సిడీ ఇస్తే బాగుండు. ఖర్చులు తగ్గుతాయి.

– శివకృష్ణారెడ్డి

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


ప్రశంసపత్రం అందజేస్తున్న సీతారామయ్య

**నస్పూర్:** పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద గల నర్సయ్య భవన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించిన సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 89 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, బ్రాంచి ఉపాధ్యక్షులు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, నవీన్‌రెడ్డి, చంద్రమోహన్, వేణు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉదారత చాటుకున్న 'సోపతి' సభ్యులు


అంత్యక్రియల్లో పాల్గొన్న సభ్యులు

**జైపూర్:** చిన్న వయసులోనే తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఇద్దరు అక్కలకు ఆ తమ్ముడే జీవనాధారం అయ్యాడు. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన ఆ తమ్ముడు కూడా చివరకు తలసేమియా వ్యాధితో పండగ పూట మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదంలో మునిగింది. జైపూర్ మండలం షెట్‌పల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన తుంగపిండి కృష్ణ తలసేమియాతో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందగా మంగళవారం మృతదేహం గ్రామానికి చేరుకుంది. వాట్సాప్ స్టేటస్ ద్వారా విషయం తెలుసుకున్న సోపతి వెల్ఫేర్ సొసైటీ, కోవిడ్ వాలంటీర్స్, నెన్నెల వ్యవస్థాపకులు భీమ్ పుత్ర శ్రీనివాస్, సభ్యులు వెంకటేశ్, రాజబాబు, రమేశ్, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, రవికాంత్ దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. మెల్టింగ్ హర్ట్స్ సంస్థ ద్వారా రూ.15వేలు, మూర్తి సార్ రూ.9వేలు బాధిత కుటుంబానికి అందించారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- ఏడు ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలమ్

**ఆదిలాబాద్‌టౌన్:** నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి దొంగిలించిన ఆభరణాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ గౌస్ ఆలమ్ అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడం జరిగిందన్నారు. ఐదుగురిపై కేసులు నమోదు చేయగా, నలుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఎజాజ్, రవీంద్రనగర్‌కు చెందిన టి.అజయ్, టీచర్స్ కాలనీకి చెందిన ఎం.రాజేశ్వర్, కోలిపురకు చెందిన షేక్ సమీర్‌లను అరెస్టు చేయగా, మహారాష్ట్రకు చెందిన సయ్యద్ మున్వర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, ఆటో, ఒక టీవీ, వెండీ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి మహారాష్ట్రలోని కిన్వట్‌లో అమ్ముతున్నారని అన్నారు. డీఎస్పీ పోతారం శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### టిప్పర్ ఢీకొని బాలుడు మృతి


సిద్ధార్థ్ (ఫైల్)

**నిర్మల్‌రూరల్:** పండుగ పూట పతంగి కొనుక్కొని ఇంటికి వెళ్తున్న ఓ బాలుడిని టిప్పర్ రూపంలో మృత్యువు కబలించింది. అప్పటి వరకు తోటి స్నేహితులతో సరదాగా ఆడుకున్న బాలుడు టిప్పర్ ఢీకొని మృతి చెందిన విషాద ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన రాజేందర్ – సుమలత దంపతులు జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రాంతంలో కొంతకాలంగా నివాసముంటున్నారు. రాజేందర్ గతంలో 104 వాహన డ్రైవర్‌గా పనిచేయగా, ప్రస్తుతం ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య బట్టలు కుడుతూ కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. వీరికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు సిద్దార్థ్ (11) ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి రోజు తోటి మిత్రులతో సరదాగా ఆడుకున్న తర్వాత పతంగి కొనేందుకు సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో లోడుతో వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ టిప్పర్‌ను వదిలేసి వెంటనే పరారయ్యాడు. స్థానికులు టిప్పర్‌ను కాస్త పక్కన పెట్టి టైర్ల కింద నుంచి బాలుడిని బయటకు తీశారు. 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఎంసీ పాలకవర్గం పదవులకు పోటాపోటీ


బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ఆశావహులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. చైర్మన్ పదవికి అర డజన్ మంది, డైరెక్టర్ పదవులకు డజన్‌కు పైగా మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఏఎంసీ పాలకమండళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయా పదవులు కోసం ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆశావహుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ గెలుపు కోసం శ్రమించిన ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కన్నెపల్లి మండలానికి చెందిన ఓ ముఖ్య నాయకుడి పేరు ముందు వరుసలో ఉండగా, బెల్లంపల్లి గ్రామీణ ప్రాంతం నుంచి ఇద్దరు, తాండూర్, నెన్నెల మండలాల నుంచి ఒక్కో నాయకుడి పేరు ప్రచారంలో ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపాల్టీ నుంచి మరో ముగ్గురు చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. గతంలో చైర్మన్ పదవి చేపట్టిన ఓ ముఖ్య నాయకుడు ఈసారి జిల్లా స్థాయి పదవి కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. ఆ నాయకుడి పేరు పోటీలో లేకపోవడంతో ఇతర నాయకులు చైర్మన్ గిరిపై ఆశలు పెంచుకున్నారు. గ్రామస్థాయి శ్రేణులు డైరెక్టర్ పదవులపై భరోసాతో ఉన్నారు. నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా ప్రతీ మండలానికి ఒకరి చొప్పున ప్రాతినిధ్యం కల్పించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అభ్యర్థుల ఎంపిక స్థానిక ఎమ్మెల్యేపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ఇతర ముఖ్య పదవులేమీ లేకపోవడంతో అందరి దృష్టి ఏఎంసీపైనే కేంద్రీకృతమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఎవరిని ప్రతిపాదిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# గుండెపోటుతో యువకుడు మృతి


సునీల్(ఫైల్)

**ఆదిలాబాద్‌రూరల్:** మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన జిల్లా దళితాభివృద్ధి శాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఈరగొల్ల సునీల్(39) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సునీల్ 2016 నుంచి జిల్లా దళితాభివృద్ధి శాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా ఛాతిలో నొప్పి వచ్చింది. చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు వైద్య పరీక్షిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రీవేణి, కుమార్తె మిల్కు, కుమారుడు మణిదీప్ ఉన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.